పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్ : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-కడప

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.10 లక్షల ఎల్ఒసిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీలో వర్తించని జబ్బులకు సహాయనిధిని మంజూరు చేస్తున్నారని చెప్పారు. కడప నగరంలో నాలుగేళ్లల్లో రూ.8 కోట్లకుపైగా సిఎం సహాయం కింద పేదలకు అందించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో 44వ డివిజన్ ఇన్‌ఛార్జి వెల్లాల రామకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్ సుబాహాన్, బండిబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని

అంగన్వాడీల ఆందోళన

కనీస వేతనం రూ.26 వేలు.. గ్రాడ్యుటీ తక్షణమే అమలు.. పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)తోపాటు ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్వాడీ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో అంగన్వాడీ సంఘాలు జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెబాట పట్టారు.

కడప అర్బన్ : అంగన్వాడీలకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా, నగర ప్రధాన కార్యదర్శులు మనోహర్, వెంకటసుబ్బయ్య, ఎఐటియుసి నగర నాయకులు మద్దిలేటి, ఎపి అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా ఐసిడిఎస్ కడప అర్బన్, రూరల్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు బైఠాయించి నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కన్నా అదనంగా రూ. 1000 వేతనం ఇస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటలు ఏమైనాయని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని తక్షణమే అమలు చేయాలన్నారు. అలాగే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఐసిడిఎస్ కు బడ్జెట్ కేటాయింపులు చేసి నిధులు పెంచి, ఫ్రీ స్కూల్ బలోపేతం చేయాలని చెప్పారు. అర్హులైన హెల్పర్స్‌కు ప్రమోషన్ల నిబంధనలను రూపొందించి, ప్రమోషన్ల వయస్సు 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టిఎ, డిఎతోపాటు ఇతర బకాయిల బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, మినీ అంగన్వాడీలు, ఆయాలు అనేక రకాల సేవలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా కరోనా కాలంలో ఇంటింటికి తిరిగి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేశారని చెప్పారు. అలాంటి వర్కర్లకు కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సోకి వందలాదిమంది స్కీమ్ వర్కర్లు చనిపోయిన కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని, అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో యూనియన్ నాయకురాలు అంజనీ దేవి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక బద్వేలు సమగ్ర శిశు అభివృద్ధి అధికారి (సిడిపిఒ) కార్యాలయం వద్ద అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, అంగన్వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కె. సుభాషిని, ప్రధాన కార్యదర్శి ఆర్.హుస్సేనమ్మ,, ప్రాజెక్టు నాయకురాలు జయప్రద, సోభదేవి, సత్యవతి, కళావతి, రాధమ్మ, విజయమ్మ, తులసమ్మ, వెంకట నరసమ్మ, వసంతమ్మ, శ్రీలత, లీలావతి, కళావతి, క ృష?వేణి, ప్రవీణ, ఉమాదేవి, లక్ష్మి నరసమ్మ, మహాలక్ష్మి బద్వేల్, గోపవరం, అట్లూరు, బి కోడూరు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు మినీ అంగన్వాడీలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల సమస్యలు పరిష్క రించాలని స్థానిక రూరల్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయకుమార్, మున్సిపల్ యూనియన్ రాఘవ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శిసాల్మన్, అధ్యక్షులు చంటి, ఎలక్ట్రిసిటీ నాయకుడు బాలసుబ్బయ్య, (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, అధ్యక్షులు రాణి, సువార్తమ్మ, నాగలక్ష్మి, గీత, రాజీ, సునీత, రామసుబ్బమ్మ, రాజుపాలెం సెక్టార్‌లో నిర్మల, ఇందిరా, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **చాపాడు :** అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ సిఐటియు నాయకులు ధనలక్ష్మి డిమాండ్ చేశారు.. మైదుకూరు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మైదుకూరు, ఖాజీపేట మండలాల కార్యకర్తలు,, చాపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద దువ్వూరు, బిమఠం, చాపాడు అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు, ఎఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయ కులు శ్రీరాములు, అంగన్వాడీ కార్యకర్తల నాయకులు సుజాత , అరుణ, వెంకట సుబ్బమ్మ, చెన్నమ్మ, లక్ష్మీదేవి, వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బైరవ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో ని ఐసిడిఎస్ కార్యాలయంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, పోరుమామిళ్ళ సీఐటీయూ మండల లీడర్ బొజ్జ చిన్నయ్య, సుందరం ,జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి గురయ్య, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షులు వినోద దేవి, పోరుమామిళ్ల మండల సెక్టార్ లీడర్లు దస్తగిరిమ్మ ,జ్యోతి, రేణుక , కాశి నాయనమండలం ఇటుకలపాడు సెక్టార్ లీడర్ లక్ష్మీదేవి, శ్రీదేవి ,రమాదేవి, కలసపాడు మండలం సెక్టార్ లీడర్లు అనురాధ విజయమ్మ రమాదేవి,అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు మినీ అంగన్వాడీలు పాల్గొన్నారు. **బి. కోడూరు :** న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్లు సిఐటియు, ఎఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న ఐసిడిఎస్ కార్యాలయం ముందు మంగళవారం ఉదయం అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. ధర్నాకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనివాసులు రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి సలీమా ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌లు పాల్గొన్నారు. **వేంపల్లె :** అంగన్వాడీలకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి బాదుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా వేంపల్లె ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి, సిఐటియు అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు బైఠాయించి నిరవధిక సమ్మె చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పెద్ద ఎత్తున్న పాల్గొని తమ నిరసన తెలియజేశారు. **జమ్మలమడుగు :** రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 1నుంచి గర్భిణులకు, బాలింతలకు అమలు చేస్తున్న నుంచి అమలు చేస్తున్న ఫేస్ యాప్ ను రద్దు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని ఐసి డిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు నరసమ్మ, సుబ్బలక్ష్మి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

మైదుకూరులో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

పులివెందులలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

కడప ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న విసి చింతా సుధాకర్

'బ్రౌన్' పర్వం స్వర్ణయుగం

వైవీయూ విసి చింతా సుధాకర్

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు సంస్కృతిలో బ్రౌన్ పర్వం ఒక స్వర్ణయుగమని, తన ధనాన్ని, సమయాన్ని తెలుగు ప్రజలకు, తెలుగు భాషా సాహిత్యాలకు ధారాళంగా వినియోగించి తాను మాత్రం రిక్త హస్తాలతో స్వదేశం వెళ్లిపోయిన మహానుభావుడు సి.పి.బ్రౌన్ అని యోగివేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 140వ వర్ధంతి సభను మంగళవారం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించింది. అతిథులతో కలిసి ముందుగా పరిశోధన కేంద్రం ప్రాంగణంలోని సి.పి.బ్రౌన్, డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సి.కె.సంపత్ కుమార్ విగ్రహాలకు, సమావేశమందిరంలోని సి.పి.బ్రౌన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ శతాబ్దంలో సి.పి.బ్రౌన్ అంత గొప్పగా శ్రమించకుంటే తెలుగుభాషా సాహిత్యాలు అధోగతి పాలయి ఉండేవన్నారు. ఆయన తెలుగుభాషకు అమరసింహుడన్నారు. తెలుగు పుస్తకం గొప్పతనాన్ని విదేశీయులకు చాటిచెప్పాడని చెప్పారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు షేక్‌హుస్సేన్ సత్యాగ్ని మాట్లాడుతూ రెండువందల సంవత్సరాలకు పైగా మనల్ని పాలించిన ఆంగ్లేయుల్లో ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ స్థానం ఉన్నతమైందని తెలిపారు. గౌరవ అతిథి, యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సి.పి.బ్రౌన్ క ృషి వల్లనే వేమన తెలుగు నేలలో చిరస్థాయిగా నిలిచిపోయారని, వేమన పద్యాలను ఇప్పుడు పాఠశాల స్థాయిలో విద్యార్థులు చదువుకోగలుగుతున్నారని అన్నారు. అనంతరం 'తాతాచార్ల కథలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలక ృష్ణ శాస్త్రి పుస్తక పరిచయం చేశారు. అరుదైన తాళపత్ర గ్రంథాలు, అరుదైన పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు కె. సరస్వతీ ప్రసాద్ తన బృందంతో అన్నమాచార్య సంకీర్తనావళిని మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, పోచంరెడ్డి సుబ్బారెడ్డి, వై.ప్రతాపరెడ్డి, గజ్జెల అశోక్ కుమార్ రెడ్డి, భూపతి రాయల్, సాయి విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ మైథిలి, విద్యార్థులు, శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులు, బాలవికాస్, సి.జి.ఆర్. పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

దేశ సంపదను కార్పొరేట్లకు

దోచిపెడుతున్న మోడీ : సిపిఎం

ప్రజాశక్తి-బద్వేల్

దేశ సంపదను కార్పొరేట్లకు ప్రధాని మోడీ దోచిపెడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు పి. చాంద్‌బాషా, జి. రాజుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల కోసం ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో నూటికి 30 శాతం ప్రజలు పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్నారని చెప్పారు. సామాజిక అభివృద్ధి అంటే విద్య, వైద్యం ఉచితం చేయడమేనని, అలాంటి చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం లేదని వాపోయారు. వీరు ప్రవేశపెట్టే పథకాలు బూటకమని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అసహనంతో స్పోర్టివ్ పాలిటిక్స్‌ను విడిచిపెట్టి కక్షపూరతంగా వ్యహరిస్తోందని తెలిపారు. వైసిపి విధానాల్లో మార్పు రాకపోతే కర్ణాటకలో బిజెపికి, తెలంగాణాలో బిఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. దేశంలోనే 50 శాతం మంది ప్రజలు పేదలుగా మారడానికి విద్య, వైద్యం ఖర్చులే కారణమన్నారు. పాలకులు ఈ రెండింటినీ ఎందుకు వ్యాపారం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. సమా వేశంలో సిపిఎం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌పితో మాట్లాడుతున్న కర్నూల్ రేంజ్ డిఐజి సెంథిల్‌కుమార్

సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఐజి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను ఎస్‌పి సిద్దార్ధ్ కౌశల్‌తో కలిసి కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. చోరీ కేసుల్లో సొత్తు రికవరీకి త్వరిత గతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ నారాయణ యాదవ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- కడప అర్బన్

అభాగ్యులకు, యాచకులకు శాంతి సేవా సొసైటీ నాలుగవ ఆవిర్భావ దినోత్సవం, క్రిస్మస్ పండుగ, గ్లోరీ సెక్యూరిటీ ఏజెన్సీ అధినేత అయ్యూరి మునేయ్య పుట్టినరోజు సందర్భంగా గ్లోరీ సెక్యూరిటీ ఏజెన్సీ వారి ఆర్థిక సహాయంతో వివిధ కూడళ్లలో నిద్రిస్తున్న యాచకులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు ప్రసాద్ మాట్లాడుతూ శాంతి సేవ సొసైటీ ఆవిర్భావం ఉద్దేశం మన చుట్టూ ఉన్న పేదలకు ఎంతో కొంత సాయం చేయడమే అన్నారు. శాంతి సేవా సొసైటీ ఆవిర్భవించిందని. ప్రస్తుత రోజులలో జన్మదిన వేడుకలు, వివాహ దినోత్సవాలు వేలకు వేలు డబ్బులు వెచ్చించి అంగరంగ వైభవంగా విందులు, వినోదలతో జరుపుకోవడం పరిపాటిగా మారిందని చెప్పారు. అలాంటి వేడుకలకు వస్తే పేదలకు పట్టెడు అన్నం కానీ, ఒక వస్త్రాన్ని కాని అందించడం అలవాటుగా చేసుకోవాలని కోరారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్

రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ఘటనలకు పాల్పడకుండా వీల్లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్‌పి సిద్దార్ధ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్లకు, చెడు నడత కలవారికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న రౌడీ షీటర్లకు సాక్షాధారాలతో శిక్షలు పడేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. న్యాయస్థానాల్లో తగిన సాక్షాధారాలతో రౌడీ షీటర్లకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటే తద్వారా వారి అక్రమ కార్యకలాపాలకు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలవుతుందని తెలిపారు. 'దిశ' ట్రాక్ కేసులు అనగా మహిళలు బాధితులుగా ఉన్న కేసులు, పోక్సో తదితర ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసుల విచారణ త్వరితగతిన పూర్తయి ముద్దాయిలకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అనదపు ఎస్‌పి తుషార్‌డూడి, ఎఆర్ అదనపు ఎస్‌పి కృష్ణారావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ప్రవీణ్‌కుమార్, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

క్రిస్టియన్ భవన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న మల్లెం విజయ్‌భాస్కర్

క్రైస్తవులకు క్రిస్టియన్ భవన్ ఏర్పాటు చేయాలని కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ కోరారు. మంగళవారం కడప నగరం నాగరాజు పేట స్టార్ ఫంక్షన్ హాలులో కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ ఆధ్వర్యంలో సమైక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులుగా అమలాపురం నుంచి వచ్చిన బ్రదర్ నరేష్ కుమార్ సందేశం అందించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది పేద పాస్టర్లకు వసతి గృహాలు లేవని, కడపలో క్రిస్టియన్ భవనం ఏర్పాటు చేయాలని అన్నారు. పాస్టర్లకు గౌరవేతనం రూ. 5000 నుంచి రూ. 10000 వరకు పెంచాలని కోరారు. అనేక ప్రాంతాల్లో క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ లేదని, ప్రభుత్వం ద్వారా మాకు ఎటువంటి ఆర్థిక పరమైన వనరులు అందలేదని అన్నారు. కార్యక్రమంలో కడప సిటీ ఇండిపెండెంట్ పాస్టర్స్ అధ్యక్షులు షడ్రక్ రాజు, పాస్టర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయ భాస్కర్, పాస్టర్ పి.మహేష్ పాల్గొన్నారు.

నేడు రిమ్స్‌లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కడప

ఆస్పత్రి నూతన భవనాలకు కొత్త లైన్ల ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో రిమ్స్ ఆస్పత్రికి ఈనెల 13న ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని కడప ఎపి ఎస్‌పిడిసిఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసమయంలో ఆపరేషన్ థియేటర్లలో సర్జరీలు వాయిదా వేసుకోవాలని, తప్పనిసరైతే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

ఎఎన్ఎంలకు సీనియార్టీ లిస్ట్‌లో చోటు కల్పించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆర్‌డికి వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌జిఒ సంఘం నాయకులు

ఎల్‌హెచ్‌బి శిక్షణ పూర్తయిన ఎఎన్ఎంలకు సీనియార్టీ లిస్టులో చోటు కల్పించాలని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి డి. రవికుమార్ కోరారు. మంగళవారం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 85 మంది ఎల్‌హెచ్‌బి శిక్షణ పూర్తి చేశారన్నారు. వారిని జిల్లా అధికారుల నుంచి వివరాలు తెప్పించుకుని సీనియార్టీ లిస్టు తయారు చేయాలని కోరారు. మహిళా సూపర్‌వైజర్లను పిహెచ్‌ఎన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌డి స్పందిస్తూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సహ అధ్యక్షులు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్యపూజయ్య, ఉపాధ్యక్షులు బాలపుల్లయ్య, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి, పద్మనాభం పాల్గొన్నారు.

సమైక్యత సమ్మేళన సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-బద్వేల్

ఈనెల 19న నెల్లూరు పట్టణంలో నిర్వహించే హిందూ, ముస్లిముల సమైక్యత సమ్మేళన సభను విజయవంతం చేయాలని జైభారత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా ఇన్‌ఛార్జి గురవయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆవాజ్ కమిటీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ. సత్తార్ ఆధ్వర్యంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ సమైక్యత సభకు హిందూ, ముస్లిములు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘ: రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి. గురుమూర్తి, ఆవాజ్ పట్టణ అభివృద్ధి కమిటీ కన్వీనర్ నానబాల వెంకటేశ్వర్లు, ముస్లిమ్ మైనార్టీలు నాయకులు కె.బి. రసూల్, గౌస్, నాగూర్‌బాషా, రసూల్, అన్వర్‌బాషా, వేణు పాల్గొన్నారు.

ఆర్‌డిఒను కలిసిన వైసిపి నాయకులు

చుక్కల భూ సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులు చుక్కల భూముల సమస్యతో చిక్కులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని మండల వైసిపి నాయకులు కోరారు. ఆ మేరకు వారు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి చుక్కల భూముల సమస్యకు పరిష్కారాన్ని చూపాలని విన్నవించామన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ రెండు వారాల్లోపు చుక్కల భూములకు సంబంధించి దస్త్రాలను తెప్పించుకొని రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, వారి సమస్యను పరిస్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల వైసిపి కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళిమోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, నాయకులు కొండారెడ్డి పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

- యాదవ సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రొద్దుటూరు 1వ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ హైమావతిపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బి.మఠం శ్రీయాదవ సమాజ అన్నదాన సత్రం పాలక మండలి ప్రెసిడెంట్ పెరుగు కృష్ణయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పాలకమండలి సభ్యులు ఎస్ఐ కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పి దాడి జరిగిన విషయం తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిజాయితీగా పని చేస్తున్న ఒక మహిళా ఎస్ఐపై దాడి చేయడం దారుణమన్నారు. దాడి జరిగి పది రోజులైనా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సత్వరమే న్యాయం చేయాలన్నారు. లేదంటే ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీ యాదవ సమాజం అన్నసత్రం ప్రతినిధి బాలరాజు యాదవ్, పెద్దన్న, సుబ్బరాయుడు, క్రిష్ణ యాదవ్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ డైరెక్టర్‌గా తల్లం సుధాకర్

ప్రజాశక్తి - చాపాడు

తల్లం సుధాకర్, దొందు సుబ్రహ్మణ్యం

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ 2024 డైరెక్టర్‌గా మైదుకూరుకు చెందిన తల్లం సుధాకర్ ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఐకాన్ సమావేశంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మధురైకి చెందిన రవిచంద్రన్ తన నూతన కమిటీలను ఎంపిక చేశారు. ఈ క్రమంలో తల్లం సుధాకర్‌ను మల్టీపుల్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. తల్లం సుధాకర్ ఉమ్మడి కడప, అనంతపురం జిల్లాలకు గవర్నర్‌గా విధులు నిర్వహిం చారు. అడిషనల్ ట్రెజరర్‌గా దొంతు సుబ్రహ్మణ్యంను నియమించగా వి 206లో మైదుకూరుకు చెందిన రీజియన్ చైర్మన్ పబ్బతి గోపాల్, కెసిజిఎఫ్ ఇన్‌ఛార్జిగా సూరే సుబ్బరాజు పదవులు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ చిరువీధి వేణుగోపాల్, యాదా నాగేశ్వరరావు, గంపా నాగేశ్వరరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'గండి' దేవస్థానం చైర్మన్‌గా కావలి కృష్ణతేజ?

ప్రజాశక్తి - వేంపల్లె

చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రం దేవస్థానం చైర్మన్‌గా కావలి కృష్ణతేజను నియమిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న గండి పాలక మండలి సభ్యుల నియామకం జరిగి రెండేళ్లు పూర్తయింది. నూతన పాలక మండలికి కొత్త నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నేపథ్యంలో వైసిపి అధిష్టానం కొత్త పాలక మండలి నియామకం చేసేందుకు కసరత్తు చేపట్టింది. వైసిపికి మద్దతుగా నిలిచిన బలిజ(కాపు) కులస్థులకు ఇచ్చేందుకు ఎంపీ అవినాష్‌రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. కాపు కులస్థుల్లో వేంపల్లె మండలం ఇడుపులపాయ పంచాయతీలోని వీరన్నగట్టుపల్లి గ్రామానికి చెందిన మాజీ గండి ఛైర్మన్ కావలి విజయ్ కుమారుడైన రాయలసీమ కాపునాడు యవజన సంఘం అధ్యక్షుడు కావలి కృష్ణతేజకు గండి చైర్మన్ పదవి ఇచ్చేందుకు ఎంపీ మొగ్గు చూపినట్లు తెలిసింది. కొందరు ఉన్న పాలక మండలి సభ్యులనే కొనసాగిస్తే బాగుంటుందని ఎంపీ దృష్టికి తెచ్చినప్పటికీ కొత్త పాలక మండలి ఏర్పాటుకు ఎంపీ ఆసక్తి కనబరిచినట్లు సమాచారం.

క్రైం కార్నర్

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మద్యం మత్తులో బుడ్డాయపల్లె సమీపంలోని కాలువలో పడి సుధాకర్‌రెడ్డి(37) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతదేహం మంగళవారం బయటపడడంతో విషయం వెలుగు చూసింది. బుడ్డాయపల్లి వాసులు శ్మశానానికి దారికోసమని సొంత నిధులతో కల్వర్టును ఏర్పాటు చేసుకున్నారు. కల్వర్టు కింద కాలువ ఉంది. పూర్వకాలంలో ఈ కాలువ నీరు తాగేవారు. ప్రస్తుతం మురికినీటితో ఉంది. కల్వర్టుపై సైకిల్ తొక్కుకుంటూ వెళ్తూ మద్యం మత్తులో అదుపు తప్పి కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సిఐ తెలిపారు.

పలు ఆలయాల్లో చోరీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పలు ఆలయాల్లో చోరీలు జరిగాయి. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పుల్లూరు సమీపంలోని కాశినాయన ఆలయంలో, భూమాయపల్లె సమీపంలోని జాతీయ రహదారి సమీప ఆలయం, పుల్లూరులోని గంగమ్మ దేవాలయల్లో పెద్ద ఎత్తున చోరీ జరిగింది. ఆలయాల్లోని హుండీలను ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. కార్తీకమాసం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు కానుకలు సమర్పించారు. దాదాపు పలు ఆలయాల్లో రూ.లక్షకు పైబడి నగదు చోరీకి గురై ఉంటుందని భావిస్తున్నారు. చోరీలపై మంగళవారం పోలీసులు విచారణ చేపట్టారు.

ఆంజనేయ స్వామి హుండీ అపహరణ

చాపాడు : మైదుకూరు-ప్రొద్దు టూరు జాతీయ రహదారి చాపాడు మండల పరిధిలోని విశ్వ నాథపురం వీరాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మంగళవారం ఉదయం దేవాలయం దగ్గరకు చేరుకొని స్థానికులు, పోలీసులతో చోరీపై చర్చించారు. నిందితులను వెంటనే గుర్తించాలని ఎస్ఐకి సూచించారు. 8 నెలలుగా లెక్కించలేదని వారు తెలిపారు. ఎస్ఐ మైనుద్దీన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

7వ వేతన కమిటీ అంశాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

తపాలా శాఖ ఉద్యోగులకు 7వ వేతన కమిటీలోని అన్ని అంశాలను వెంటనే అమలు చేయాలని ముద్దనూరు తపాలా శాఖ బ్రాంచ్ పోస్టు మాస్టర్లు నరసింహరావు, గంగా నందుడు డిమాండ్ చేశారు. స్థానిక తపాలా కార్యాలయం వద్ద మంగళవారం కేంద్ర సంఘాల పిలుపు మేరకు తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తపాలా శాఖ ఉన్నతాధికారులు చర్చల పేరుతో 7వ వేతన కమిటీలోని అంశాలను కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. తపాలా శాఖలోని ఉద్యోగులకు ప్రధానంగా 8 డిమాండ్లు అమలు చేయాలని దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి జిడిఎస్‌కు సివిల్ సర్వెంట్ హోదా కల్పించి 8గంటల పని కల్పించాలన్నారు. సీనియర్ జిడిఎస్‌లకు 12, 24, 36 సర్వీసు పూర్తయిని వారికి అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. జిడిఎస్ గ్రూపు ఇన్సూరెన్స్, గ్రాంట్యుటీ రూ.5లక్షలకు పెంచాలనే పలు డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో నాగలత, పద్మకుమారి, రమేష్ బాబు, శివమ్మ, గురుదేవ్, భార్గవి పాల్గొన్నారు.

ముద్దనూరు : ఆందోళనలో తపాలా సిబ్బంది

గ్రంథాలయ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప నగరంలోని బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6.87 కోట్లు విడుదల చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపి బ్రౌన్ 139వ వర్ధంతిని మంగళవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి బ్రౌన్ చిత్ర పటానికి వారు నివాళు లర్పించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయుడైన సిపి బ్రౌన్ తెలుగు నేర్చుకొని తెలుగు నిఘంటువును రచించి తెలుగు భాషోద్ధారకుడు అయినట్లు చెప్పారు. బ్రౌన్ జ్ఞాపకార్థం స్వర్గీయ జానమద్ది హనుమశాస్త్రి ఇంటిని బ్రౌన్ గ్రంథాలయంగా మార్చినట్లు చెప్పారు. గ్రంథాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6.87 కోట్లు మంజూరు చేసి 28 నెలలు అవుతున్నా నిధులు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. దేశంలోనే తొలి భాషా సంయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యలో మాతృభాష తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ జగన్ ప్రభుత్వం జిఒ జారీ చేయడం చారిత్రాత్మక తప్పిదమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, శివ, వినయ్, బద్రి, మహబూబ్ పీరా, మహమ్మద్ రఫీ, రాఘవయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో వైద్య రంగానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కాంగ్రెస్ పాలనలో వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నిచ్చినట్లు ఆ పార్టీ పులివెందుల అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యుడు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. పులివెందుల పట్టణంలో ప్రాంతీయ ఆసుపత్రిలో మంగళవారం వైద్య కళాశాల సూపరింటెండెంట్ విగ్నేశ్వరరావు, ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వరాజ్‌ను కలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి, వైద్యుల సమయపాలన తదితర అంశాలపై ఆరా తీశారు. అక్కడే ఆయన వార్డులను కలియ తిరిగారు. వైద్య సేవల గురించి రోగులతో మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు సూత్రాల అమలు కార్యక్రమంతోపాటు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు.

సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న తిరుపాల్ రెడ్డి

గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ఆర్‌టిసి కార్మికుల గేట్ సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఆర్‌డిసి డిపోలో సెంట్రల్ కమిటీ ఆదేశాల మేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ మంగళవారం గేట్ సమావేశాన్ని నిర్వహించింది. మేనేజింగ్ డైరెక్టర్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి సమావేశంలో పాల్గొన్నారు. డిపో సమస్యలపై చర్చించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ మైదుకూరు డిపో కార్యదర్శి సిద్దయ్య, మాజీ కార్యదర్శి రాయుడు, డిపో ప్రెసిడెంట్ బిఎస్ రెడ్డి. రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి రాయుడు, సిసిఎస్ డెలిగేటు ఎన్వీ నరసింహులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న గంగిరెడ్డి

ఇప్పట్ల గ్రామం సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, వైసిపి నాయకులు చవ్వా దుష్యంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి చెందిన క్రిష్టిపాటి గంగిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులచే కేక్ కట్ చేయించి, పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల్, సాయి పాల్గొన్నారు.

ఎసి నుంచి చెలరేగిన మంటలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని సాయిబాబా గుడి వద్దనున్న తుంగ వెంకటరామిరెడ్డి ఇంట్లో మంగళవారం సాయంత్రం ఎసి నుండి మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు ఎసి వేసుకొని కూర్చున్న సమయంలో ఒక్కసారిగా మంటలు లేచాయి. కుటుంబ సభ్యులు అప్రమత్తమై నీటితో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే మంటలు ఎక్కువై ఎసి పూర్తిగా కాలిపోయింది. ఇల్లంతా పొగతో నిండిపోయింది. కుటుంబ సభ్యులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. దీనిపై ఎసి కంపెనీ మీద వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు దాఖలు చేస్తున్నట్లు వెంకటరామిరెడ్డి తెలిపారు.

బాబుతోనే 'భవిష్యత్‌కు గ్యారంటీ'

ప్రజాశక్తి - (ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్) : చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్‌కు గ్యారెంటీ ఉంటుందని టిడిపి ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి సతీమని మౌనిక తెలిపారు. రూరల్ పరిధి గోపవరం పంచా యతీ 15వ వార్డు శ్రీనివాసపురంలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ప్రచారం చేశారు. చంద్రబాబు హయంలోనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని వారు వివరించారు. కార్యక్రమంలో మల్లెల భాస్కర్‌రెడ్డి, మాజీ వార్డు మెంటర్ గురివిరెడ్డి, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాస యాదవ్, రాజుపాలెం మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, టిఎన్‌టియుసి పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసీ శ్రీనివాస యాదవ్, మేస్త్రీ గురివిరెడ్డి పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను చూపుతున్న టిడిపి నాయకులు

టెక్స్‌టైల్ పార్కు ప్రారంభానికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలంలో ఉన్న టెక్స్‌టైల్ పార్కు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీఒ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం మారుతున్నా మైలవరంలోని చేనేతల కోసం నిర్మించిన టెక్స్‌టైల్ పార్కు భవిష్యత్ మాత్రం మారడం లేదన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. 2006లో ప్రారంభమైన టెక్స్‌టైల్ పార్కును నాడు రాజశేఖర రెడ్డి ప్రభుత్వం హయాంలో 2009లో నిర్మాణం పూర్తయిందన్నారు. దీనికోసం నాటి ప్రభుత్వం 62 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. రూ.7 కోట్ల 60 లక్షల ఖర్చు పార్కు నిర్మాణానికి కేటాయించారన్నారు. పార్కు వస్తే వేల చేనేతల కుటుంబాలకు జీవనోపాధి, వ్యాపార సంవృద్ధి లభిస్తుందన్నారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు చుట్టూ పక్కల మండలాలు, గ్రామాలలో చేనేతలు ఎక్కువగా మగ్గాలపై జీవిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లా లక్ష్మీనారాయణ, దాసు, సహాయ కార్యదర్శి కొండయ్య, సభ్యులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న చేనేత సంఘం నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎపిసిసి రాష్ట్ర డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలోని వ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న మళ్లీ సిఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాలకు చెందిన బోర్డును ఆవిష్కరించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మిగాయిత్రి, వార్డు మెంబర్లు ముత్యాల ఆంజనేయులు, గణేష్, ఇఒపిఆర్డి మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఎంపిటిసి భారతి, ప్రసాద్, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న చంద్రఓబుల్‌రెడ్డి

మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం ముంపు గ్రామాల సమస్యలపై చేసే పాదయాత్రను జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ రెడ్డిపిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 7 గంటలకు ఎర్రగుడి పెద్దమ్మ దేవాలయం దగ్గర నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పాదయాత్ర దత్తాపురం, తాళ్ల ప్రొద్దుటూరు, పెంజి అనంతపురం మీదుగా కొండాపురం చేరుకుంటుం దన్నారు. అక్కడ సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ ఉంటుం దన్నారు. సభకు గండికోట ప్రాజెక్టు ముంపునకు గురైన 22 గ్రామాల ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో పొన్నతోట శ్రీను, కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ అనంతరం బయటకు వస్తున్న డిఐజి

బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. కేసులు, సిబ్బంది వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌ల అప్‌గ్రేడ్ నేపథ్యంలో ఖాజీపేటకు విచ్చేశారు. కార్యక్రమంలో ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుగంగ అనుసంధాన కాలువలను సంరక్షించాలి

ప్రజాశక్తి - చాపాడు

తెలుగుగంగ ప్రాజెక్టులోనీ ఆయకట్టు రైతుల పొలాలకు నీరు అందించే అనుసంధాన కాలువలను ఎక్కడికి అక్కడ పూడ్చివేస్తున్నారని తెలుగుగంగ అధికారులు, ప్రభుత్వ అధికారులు కానీ స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా అన్యాయమని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. మైదుకూరు మండలం విశ్వనాధపురం పరిధిలోని 742 బై ఎ పొలంలో ప్రభుత్వం నుండి 42 సెంట్లకు పొలం యజమానికి నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం తీసిన పంట, పిల్ల కాలువను పూడ్చడాన్ని రైతు సేవా సమితి మైదుకూరు పట్టణ శాఖ అధ్యక్షులు కే. రామ్మోహన్‌తో కలిసి రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఆర్ 1, 2, బ్రహ్మంసాగర్ డ్యామ్‌లోకి నీరు వస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదన్నారు. ఇప్పటికే 30శాతం పంట కాలువలను ఎవరు పొలాల పరిధిలో వారు పూడ్చి వేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా తెలుగుగంగ, ప్రభుత్వ అధికారులు స్పందించి పంట కాలవలను ఎక్కడికక్కడ మరమ్మతులు చేసి అయకట్టు రైతులకు నీరు అందించకపోతే.. ఏడాది కాలంలో మొత్తం పంట కాలువలు అన్ని కూడా పూడ్చివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పంట కాలువలకు మరమ్మతులు చేసి రైతుల పొలాలకు నీరు అందించకపోతే రైతు సేవా సమితి ఆధ్వర్యంలో అయకట్టు రైతులను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పగటిపూట లైట్లు వెలగరాదు : ఎస్ఇ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఇ రమణ

అత్యవసరమైన విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, పగటిపూట లైట్లు వెలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఇ రమణ సూచించారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో మంగళవారం సబ్‌డివిజన్ సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఎక్కడైనా పగటిపూట వీధిలైట్లు వెలుగుతున్నాయని తన దృష్టికి వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. నిర్లక్ష్యంతోనే అధికశాతం విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అన్ని వేళలా అన్ని చోట్ల భద్రతా నియమాలు పాటించడం వల్ల విలువైన ప్రాణాన్ని తద్వారా ఒక కుటుంబాన్ని కాపాడినవాళ్లమవుతామన్నారు. కేటాయించిన ప్రదేశాల్లో నివాసముంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. బకాయిల వసూళ్లపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. సర్వే ప్రకారం ప్రతి 100 కుటుంబాలకు 24 కటుంబాలు ఎసి వాడుతున్నాయన్నారు. ఇవి రెట్టింపయ్యే అవకాశం ఉందని, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోడును అధిగమించాలన్నారు. జగనన్న కాలనీలలో కొత్త విద్యుత్ సర్వీసులు యుద్ధ ప్రాతివదికన విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఇఇ శ్రీనివాసులరెడ్డి, డిఇఇలు, ఎఇలు, జెఇలు, అకౌంట్ అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA

E.P.No. 69/2022

O.S.No. 72/2012

Kavali Radha Krishnaiah.

...Petitioner/D.Hr

Vs

Ambati Subbarao.

...Respondent/J.Dr.

NOTICE TO THE J.Dr.

Please take notice that the Hon'ble Court has ordered for notice to the JDr. to appear on 21-12-2023 at 10.30 A.M.in the above Court either personally or through Advocate failing which the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//

Y.SRINIVASULU

Advocate for Plaintiff/Petitioner, KADAPA.

ప్రభుత్వ వైద్య కళాశాల, కడప

Rc.No.8199/SR/E2/GMC/KDP/2023 Date:11.12.2023

ప్రభుత్వ వైద్య కళాశాల, కడపలో క్లినికల్, నాన్ క్లినికల్ స్పెషలిటీస్ విభాగముల నందు సీనియర్ రెసిడెంట్స్ నియామకం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూ.

వివరాల కోసం దయచేసి వెబ్సైటును సందర్శించండి http://Kadapa.ap.gov.in

ఇంటర్వ్యూ తేదీ: 15.12.2023

డాక్టర్ ఎ.సురేఖ,

అడిషనల్ డి.ఎం.ఇ/ ప్రిన్సిపాల్

ప్రభుత్వ వైద్య కళాశాల, కడప.